సాక్షి కర్నూలు

ఆదివారం । 29 । జూన్ । 2025



అన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్న ప్రసాద వితరణ పథకానికి శనివారం ఏలూరుకు చెందిన ఎం. రవికుమార్ రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



బంగారు పల్లకోత్సవం

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఉంచి అశేష భక్తజనం మధ్య శనివారం వైభవంగా ఊరేగించారు.



బదిలీల కౌన్సెలింగ్ గందరగోళం

సచివాలయ ఉద్యోగుల బదిలీ కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ 'టిక్ పెట్టి.. వెళ్లండి' అనడం వివాదాస్పదమైంది. 8లో▸

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం

కర్నూలు(టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు స్థానిక బిర్లా సర్కిల్ వద్దనున్న శ్రీలక్ష్మీ ఫంక్షన్ హాలులో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా గ్రామ గ్రామాన ఇంటింటా నిర్వహించాల్సిన ప్రచారంపై ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు గంగుల ప్రభాకర్ రెడ్డి హాజరవుతారన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్తలు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ రాష్ట్ర స్థాయి అనుబంధ విభాగాలు, వివిధ హోదాల్లో ఉన్న నాయకులు హాజరుకావాలని కోరారు.

సిఫార్సు లేఖలు.. అక్రమ వసూళ్లు!

- నేడు గ్రేడు–2 వీఆర్వోలు, సర్వే అసిస్టెంట్లకు బదిలీ కౌన్సెలింగ్

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడు–2 వీఆర్వోలు, సర్వే అసిస్టెంట్ల బదిలీలకు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 73 మంది, వివిధ కారణాలతో 78 మంది గ్రేడు–2 వీఆర్వోలు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అలాగే మొత్తం 800 మంది సర్వే అసిస్టెంట్లు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో చాలా మంది అనువైన స్థానం కోసం టీడీపీ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను పొందారు. వాటిని దరఖాస్తు ఫారానికి అతికించి అధికారులకు ఇచ్చారు. ఇందుకోసం ప్రజాప్రతినిధుల దగ్గర పనిచేసే వారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు అక్రమంగా డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. తమకు అనుకూలమైన వీఆర్వోలు, సర్వే అసిస్టెంట్ల కోసం ఏకంగా ప్రజాప్రతినిధులు రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులకు ఫోన్లు చేసినట్లు తెలుస్తోంది.

కూటమి హామీలపై రచ్చ

ఎమ్మెల్యే పార్థసారథి విమర్శలను అడ్డుకున్న జెడ్పీటీసీలు

- ధణాపురం దళిత సర్పంచ్ ఘటనపై తీవ్ర వాగ్వాదం
- వైద్య, ఆరోగ్య శాఖపై సుదీర్ఘ చర్చ
- ఎన్టీఆర్ వైద్య సేవలో అక్రమాలను ప్రశ్నించిన ఆదోని ఎమ్మెల్యే
- నాలుగు గంటల పాటు సాగిన జెడ్పీ సర్వసభ్య సమావేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, చిత్రంలో మంత్రి టీజీ భరత్, కర్నూలు, నంద్యాల కలెక్టర్లు రంజిత్ బాషా, రాజకుమారి , జేసీ డాక్టర్ బి.నవ్య

కర్నూలు(అర్బన్): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో 70 శాతం హామీలను నెరవేర్చామని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్న మాటలను వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతులు పంటలు సాగు చేయకముందే రైతు భరోసా కింద ఆర్థిక సాయం అందేదని, కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవగా పేరు మార్చిందే కానీ ఇప్పటి వరకు రైతులకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని వెల్దుర్తి జెడ్పీటీసీ సుంకన్న ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తోందని చెప్పడంతో జెడ్పీటీసీలు జగదీశ్వర్‌రెడ్డి, రామక్రిష్ణ, మహేశ్వరరెడ్డి తదితరులు మూకుమ్మడిగా ఎమ్మెల్యే మాటలకు అడ్డుతగులుతూ, ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం రైతులకు ఏమి చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, జెడ్పీటీసీల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి జోక్యం చేసుకుంటూ రాజకీయాలు మాట్లాడుకునేందుకు ఇది వేదిక కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్సీ డాక్టర్ బి.మధుసూదన్, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, డాక్టర్ పార్థసారథి, కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు పి. రంజిత్‌బాషా, రాజకుమారి గణియా, కర్నూలు జేసీ డాక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్, కేడీసీఎంఎస్, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్లు నాగేశ్వరరావుయాదవ్, కప్పట్రాళ్ల బొజ్జమ్మ, జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి హాజరయ్యారు.

ఉద్యాన పంటలపై అవగాహన కరువు



ఎమ్మెల్సీ మధుసూదన్

జిల్లాలో ఉద్యాన పంటల సాగుపై అవగాహన పూర్తిగా కరువైందని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎంత విస్తీర్ణంలో ఈ పంటలను సాగు చేస్తున్నారు? తీసుకోవాల్సిన మెలకువలు, చీడపీడల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించడం లేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కొత్తాళం మండలంలో 300 ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేస్తున్నారని, అయితే ఉద్యాన అధికారులు రైతులకు ఎలాంటి సలహాలు, సూచనలు అందించడం లేదన్నారు.

డ్రోన్ల వినియోగాన్ని పెంచాలి

వ్యవసాయంలో డ్రోన్ల వినియోగాన్ని పెంచాలని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. వీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. పారిశుద్ధ్యంపై జరిగిన సమీక్షలో మంత్రి టీజీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో వినియోగిస్తున్న బ్లీచింగ్ పౌడర్ ఎలా సమకూర్చుకుంటున్నారని ప్రశ్నించారు. టెండర్ ద్వారా సర్పంచులు కొనుగోలు చేస్తున్నారని జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ చెప్పారు. దీంతో మంత్రి కలుగజేసుకుంటూ గతంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ ఆధ్వర్యంలో నాణ్యమైన బ్లీచింగ్ పౌడర్ కొనుగోలు చేసేవారిని, అలాగే కొనుగోలు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

డబ్బు చెల్లించడం లేదు

మండలంలో రైతుల నుంచి జొన్నలు కొనుగోలు చేశారు కానీ ఇంత వరకు డబ్బులు చెల్లించలేదని గడివేముల జెడ్పీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కందులు కొనుగోలు చేశారు కానీ ఇంతవరకు డబ్బులు చెల్లించలేదని డోన్ జెడ్పీటీసీ రాజ్‌కుమార్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రైతులకు మేలు చేసే దిశగా చర్యలు చేపట్టాలన్నారు.

వైద్య ఆరోగ్య శాఖపై సుదీర్ఘ చర్చ

- ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ ఆళ్లగడ్డ హైవేపై ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయని, ఉన్న 50 పడకల ఆసుపత్రిలో ట్రామా సెంటర్, బ్లడ్ బ్యాంకును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు.
- డోన్‌లోని వంద పడకల ఆసుపత్రిలో అధునాతన పరికరాలు ఏర్పాటు చేయాలని జెడ్పీటీసీ రాజ్‌కుమార్ కోరారు.
- హాలహర్వి మండంలోని పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో బళ్లారికి వెళ్లాల్సి వస్తోందని జెడ్పీటీసీ లింగప్ప చెప్పారు.
- ఓర్వకల్లు హాస్పిటల్‌కు తమ వారి వైద్యం కోసం ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు మద్యం సేవించి వస్తుండడంతో వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారని, వెంటనే ఈ హాస్పిటల్‌లో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని ఓర్వకల్లు జెడ్పీటీసీ రంగనాథగౌడ్ కోరారు.

ధణాపురం దళిత సర్పంచ్ ఘటనపై తీవ్ర వాగ్వాదం



ఆదోని ఎమ్మెల్యే పార్థసారథిని నిలదీస్తున్న వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీలు, ఎంపీపీలు

ఇటీవల ఆదోని మండలం ధణాపురం గ్రామంలో చోటు చేసుకున్న దళిత సర్పంచ్‌కు జరిగిన అవమానంపై ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, ఆస్పరి జెడ్పీటీసీ దొరబాబు మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దళితుల పట్ల ఎమ్మెల్యే పార్థసారథి చిన్న చూపు చూస్తున్నారని, ఎమ్మెల్యే తప్పు చేసినందునే క్షమాపణ చెప్పారని దొరబాబు అన్నారు. తాను తప్పు చేయకపోయినా, దళిత ఉద్యమాల్లో పనిచేసిన వ్యక్తిగా క్షమాపణ చెప్పానని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్‌సీపీ వారికి దళితులంటే చిన్న చూపు ఉన్నందునే గడచిన ఎన్నికల్లో వారిని పక్కన కూర్చోబెట్టారని ఎమ్మెల్యే చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలంటే అమితమైన ప్రేమ ఉన్నందునే కోట్ల రూపాయలు వెచ్చించి రాష్ట్ర రాజధానిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారని దొరబాబు చెప్పారు.

ఎన్‌టీఆర్ వైద్య సేవలో భారీగా అక్రమాలు

ఎన్‌టీఆర్ వైద్య సేవ ముసుగులో జిల్లాలోని ప్రైవేటు ఆసుపత్రులు భారీగా అక్రమాలకు పాల్పడుతున్నాయి. ప్రభుత్వం నుంచి ప్రతి నెలా జిల్లాకు రూ.20 నుంచి 25 కోట్లు విడుదలవుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రులు ఈ సొమ్ముతో పాటు రోగులను కూడా దోచుకుంటున్నాయి. విజిలెన్స్ విచారణ జరిపించాలి.

– డాక్టర్ పార్థసారథి, ఆదోని ఎమ్మెల్యే

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- హైకోర్టు జడ్జి జస్టిస్ బీఎస్ భానుమతి



మాట్లాడుతున్న హైకోర్టు జడ్జి జస్టిస్ బీఎస్ భానుమతి

కర్నూలు(సెంట్రల్): జిల్లా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని హైకోర్టు జడ్జి(జిల్లా పోర్టు పోలియో జడ్జి) జస్టిస్ బీఎస్ భానుమతి అన్నారు. శనివారం జిల్లాకోర్టు హాలులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జి.కబర్ధి ఆధ్వర్యంలో న్యాయమూర్తులకు శిక్షణ తరగతులను నిర్వహించారు. సివిల్ దావాల్లో సెక్షన్9 సీపీసీ, లోక్‌అదాలత్ అవార్డుల్లో తీసుకోవాల్సిన చర్యలను ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు జడ్జి జస్టిస్ బీఎస్ భానుమతి వివరించారు. హైకోర్టు విశ్రాంత జడ్జి వీఆర్‌కే కృపాసాగర్, విశ్రాంత జిల్లా జడ్జి టి.వేణుగోపాల్ శిక్షణ తరగతులను కొనసాగించారు. హైకోర్టు విశ్రాంత జడ్జి వీఆర్‌కే కృపాసాగర్‌ను బార్ అసోసియేషన కార్యాలయంలో సన్మానించారు. జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పి.హరినాథ్ చౌదరి, ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు , న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏపీఎంఎస్ఐడీసీ ఈఈగా చిరంజీవులు



కర్నూలు(హాస్పిటల్): ఏపీ ఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఎం.చిరంజీవులు నియమితులయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా వెంకటరామన్నగూడెంలోని వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీ తాడేపల్లి గూడెంలో ఈఈగా పనిచేస్తున్న ఆయన డిప్యూటేషన్‌పై కర్నూలుకు వచ్చారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం వెదుళ్లచెరువు గ్రామానికి చెందిన ఆయన 1990లో ఆచార్య ఎన్‌జీ రంగ యూనివర్సిటీ(తిరుపతి)లో ఏఈగా ఉద్యోగంలో చేరారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని హార్టికల్చరల్ యూనివర్సిటీలో డీఈగా పనిచేశారు. 2014 నుంచి వైఎస్ఆర్ హార్టికల్చరల్ యూనివర్సిటీలో ఈఈగా కొనసాగుతున్నారు.

'స్టాఫ్' పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి సంబంధించి స్టాఫ్ సెలెక్షన్ కమిషన్‌లో భాగంగా 14,582 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఉప కార్మిక కమిషనర్ కె.వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునేందుకు https://ssc.gov.inను వీక్షించాలన్నారు. ఉద్యోగుల పోస్టుల వివరాలు, వయో పరిమితి, విద్యార్హత, చెల్లించవలసిన రుసుము, పరీక్ష, దరఖాస్తు నమోదు తదితర వివరాలన్నీ ఈ వెబ్‌సైట్‌లో ఉన్నాయన్నారు. కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష 2025 కోసం తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో జూలై 4వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్ష జూలై 24 నుంచి ఆగష్టు 4వ తేది వరకు జరుగుతుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ వినియోగదారులు ఆదివారం కూడా బిల్లులు చెల్లించవచ్చని విద్యుత్ శాఖ ఎస్ఈ ఉమాపతి తెలిపారు. ఆదివారం సెలవు దినం అయినప్పటికీ విద్యుత్ బిల్లుల కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయన్నారు.

క్లుప్తంగా

సరిహద్దు చెక్ పోస్టు వద్ద నగదు పట్టివేత


పట్టుబడిన నగదు

మంత్రాలయం/ఎమ్మిగనూరురూరల్: మంత్రాలయం మండలం మాధవరం గ్రామ శివారులో ఉన్న సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ అధికారులు రూ.39 లక్షల నగదును పట్టుకున్నారు. రాయచూరు నుంచి బళ్లారి వెళ్లే కర్ణాటక ఆర్టీసీ బస్సులో ఆదోనిలోని విక్టోరియా పేటకు చెందిన నాగరాజు అనే వ్యక్తి వద్ద నుంచి రూ.39 లక్షల నగదును గుర్తించి స్వాధీనం చేసుకుని విచారణ చేపట్టారు. ఎలాంటి బిల్లులు లభ్యం కాకపోవడంతో నగదును కర్నూలు ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించినట్లు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి, చెక్‌పోస్ట్ సీఐ రాయుడు తెలిపారు.

ఏఎన్ఎంల జాబితాపై గందరగోళం

కర్నూలు(హాస్పిటల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఏఎన్ఎంలకు బదిలీలకు సంబంధించి వైద్య ఆరోగ్యశాఖ శుక్రవారం రాత్రి విడుదల చేసిన జాబితాపై అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయాల్లో అన్ని కేటగిరిలకు బదిలీలను ర్యాంకు ఆధారంగా చేస్తుండగా వైద్య ఆరోగ్యశాఖలో మాత్రం డేట్ ఆఫ్ జాయినింగ్‌ను ఎలా తీసుకుంటారని దాదాపు 30 మందికి పైగా ఏఎన్ఎంలు శనివారం వారి అభ్యంతరాలను కార్యాలయ అధికారులకు అందజేశారు. తాజా జాబితాలోనూ ర్యాంకు ఎక్కువగా ఉన్న వారు పై భాగాన ఎలా ఉంటారని ప్రశ్నిస్తున్నారు. కొందరు ఏఎన్ఎంలకు 2019 అక్టోబర్ 2న జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చారని, ఆ రోజున గాంధీ జయంతి ఉండటం వల్ల సెలవు అని, ఆ తేదీని ఎలా పరిగణనలోకి తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు విడుదల చేసిన జాబితాలోనూ పలు తప్పులు ఉన్నాయని, అధికారులు వీటిని సరిచేసి ర్యాంకు ఆధారంగా జాబితా తయారు చేసి కౌన్సెలింగ్ నిర్వహించాలని వారు కోరుతున్నారు.

చిన్నారిపై కుక్కదాడి


గాయపడిన చిన్నారి

కొత్తపల్లి: ఇంటి బయట ఉన్న 9 నెలల చిన్నారి పై కుక్క దాడి చేసి గాయపరిచింది. ఈ ఘటన ముసలిమడుగు గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన విష్ణు, చిన్నారి దంపతులు తమ తొమ్మిది నెలల కూతురిని ఇంటి బయట ఉన్న అరుగు వద్ద కూర్చోబెట్టి తల్లి ఇంట్లోకి వెళ్లింది. అంతలోనే ఓ కుక్క చిన్నారిపై ఒక్కసారిగా దాడి చేసింది. చెవికి, ముక్కుకు రక్తగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమచికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు.

పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీలు

కర్నూలు(అగ్రికల్చర్):ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రాథమిక సహకార పరపతి సంఘాలకు ముగ్గురు సభ్యుల నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జీ కమిటీలను ఏర్పాటు దిశగా కూటమి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జీలు తమ పరిధిలోని పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీలను ప్రతిపాదిస్తూ ప్రభుత్వానికి జాబితాలు అందజేశారు. త్రీమెన్ కమిటీలో ఒకరు చైర్మన్, ఇద్దరు సభ్యులు ఉంటారు. ప్రభుత్వం ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజక ఇన్‌చార్జీలు ఇచ్చిన జాబితాలను సహకార శాఖకు పంపింది. ఇందులో భాగంగా సహకార శాఖ కమిషనర్ ఆయా జిల్లాల సహకార అధికారులకు జాబితాలను పంపారు. కర్నూలు జిల్లాలో 43 పీఏసీఎస్‌లు ఉండగా 28 పీఏసీఎస్‌లు.. నంద్యాల జిల్లాలో 56 పీఏసీఎస్‌లు ఉండగా 28 సంఘాలకు త్రీమెన్ కమిటీల నియామకానికి వెరిఫికేషన్‌కు సహకార శాఖ కమిషనర్ ఆదేశించారు. ఈ మేరకు డీసీవోలు చర్యలు చేపట్టారు.

బదిలీల కౌన్సెలింగ్ గందరగోళం

- సచివాలయాల ఉద్యోగుల్లో ఆందోళన
- టీడీపీ నేతల సిఫార్సులకే అధికారుల మొగ్గు


సచివాలయ ఉద్యోగులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): సచివాలయాల ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ 'టిక్ పెట్టండి.. వెళ్లిపోండి' అంటూ చెప్పడంతో సచివాలయాల ఉద్యోగులు అవాక్కయ్యారు. 'ఇదేం కౌన్సెలింగ్ తీరు' అంటూ వాగ్వావాదానికి దిగారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మున్సిపాలిటీల్లో పనిచేసే సచివాలయాల ఉద్యోగులకు రెండు రోజుల్లో కౌన్సెలింగ్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో హడావుడిగా కర్నూలు కార్పొరేషన్ అధికారులు శనివారం సుంకేసుల రోడ్డులో ఉన్న నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్ హాలులో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ఉమ్మడి జిల్లాలో 308 సచివాలయాలు ఉన్నాయి. ఒకే చోట పనిచేస్తూ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న వారిలో 173 అడ్మిన్ కార్యదర్శులు, 235 ఎడ్యుకేషన్ కార్యదర్శులు, 248 వెల్ఫేర్ కార్యదర్శులు, 208 మంది శానిటేషన్ కార్యదర్శులు ఉన్నారు. వీరందరికీ రెండు రోజుల పాటు కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. మొదటి రోజు ఉదయం 8 నుంచి 10.30 గంటల వరకు వార్డు శానిటేషన్ కార్యదర్శులకు, 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శులకు, సాయంత్రం 5 నుండి 7.30 గంటల వరకు వెల్ఫేర్ కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వచ్చిన వారు మూడు ఆప్షన్లు ఎంచుకొని వెళ్లాలని కమిషనర్ చెప్పడంతో సచివాలయాల ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బదిలీల కౌన్సెలింగ్ చేస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు ప్లానింగ్ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ బహిష్కరణ

ఈనెల 29వ తేదీ ఆదివారం వార్డు ప్లానింగ్, ఎమినిటీస్ కార్యదర్శులకు బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఈ కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తున్నట్లు సచివాలయాల ఉద్యోగుల సంఘం నాయకులు శివప్రసాద్, అలీ, భాస్కర్, జ్యోత్స్న, తారకేశ్వర్ రెడ్డి, అమర్ నాథ్, ప్రసాద్ తెలిపారు. కర్నూలు కార్పొరేషన్ అధికారులు అన్యాయంగా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని ఆరోపించారు.

కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల ఆందోళన

కర్నూలు కమిషనర్ రవీంద్రబాబు తమకు అన్యాయం చేస్తున్నారంటూ సచివాలయాల ఉద్యోగులు శనివారం రాత్రి భారీగా కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళన చేశారు. కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో డీఆర్‌ఓవెంకట నారాయణమ్మకు వినతిపత్రం ఇచ్చారు. అయితే జర్నలిస్టులు రావడంతో 'మీడియాకు ఎందుకు చెప్పారు' అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీ నేతల సిఫార్సులకే మొగ్గు..

ఎక్కడా లేని విధంగా కర్నూలులో బదిలీల కౌన్సెలింగ్ గుట్టుగా చేయడం ఏంటని కొందరు సచివాలయ ఉద్యోగులు ప్రశ్నించారు. కేవలం టీడీపీ నేతలు సిఫార్సు చేసిన వారు మాత్రమే కర్నూలు అర్బన్, పాణ్యం అర్బన్, కోడుమూరు అర్బన్‌లో కొనసాగే విధంగా అధికారులు చర్యలు చేపట్టారన్న విమర్శలు వచ్చాయి. సిఫార్సు లేని వారికి ఎక్కడ పడితే అక్కడ బదిలీ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రుణాల మంజూరు లక్ష్యం రూ.500 కోట్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఆర్థిక సంవత్సరంలో రైతులు, ఇతర అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి రూ.500 కోట్ల కొత్త రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఏసీఎస్ సీఈఓలు, డీసీసీబీ బ్రాంచి మేనేజర్లు లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం డీసీసీబీ టర్నోవర్ రూ.4,000 కోట్లు ఉందని, దీనిని రూ.4,500 కోట్లకు పెంచడంపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం పాతబస్తీ శాఖలో చైర్మన్ అధ్యక్షతన నిర్వహించిన మహాజనసభ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను ఆమోదించింది. 2024-25 సంవత్సరంలో రూ.1.26 కోట్ల నికర లాభం సాధించినట్లు ప్రకటించారు. చైర్మన్ మాట్లాడుతూ పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తి అయినందున లావాదేవీలన్నిటినీ ఆన్‌లైన్‌లో చేపట్టి పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. కార్యక్రమాల్లో డీసీసీబీ సీఈఓ పి.రామాంజనేయులు, డీసీఓ వెంకటకృష్ణ, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, ఆప్కాబ్ ప్రతినిధి దినేష్ పాల్గొన్నారు.

జీఓ నం.4 దివ్యాంగ క్రీడాకారులకు వరం

- న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్


పారా స్పోర్ట్స్ చైతన్య రథం వద్ద పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జీఓ నం.4 దివ్యాంగ క్రీడాకారులకు వరమని న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. పారా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు, కార్యదర్శి రామస్వామి ఆధ్వర్యంలో శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నుంచి ప్రారంభమైన పారా స్పోర్ట్స్ చైతన్య రథయాత్ర శనివారం నంద్యాలకు చేరుకుంది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో 3 శాతం క్రీడా కోటలో దివ్యాంగ క్రీడాకారులకు అవకాశం కల్పించిందన్నారు.అనంతరం జాతీయ స్థాయి పతకం సాధించిన దివ్యాంగ క్రీడాకారుడు వెంకట్‌ను అసోసియేషన్ నాయకులతోపాటు మంత్రి ఫరూక్ అభినందించారు. పారా స్పోర్ట్స్ జిల్లా అధ్యక్షుడు రవి కృష్ణ, దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకుడు పీవీ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


ఇస్మాయిల్ (ఫైల్)

కర్నూలు: స్థానిక సంతోష్ నగర్ వద్ద లోకాయుక్త ఆఫీస్ ఎదురుగా 44వ నంబర్ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సయ్యద్ ఇస్మాయిల్ (38) అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతపురం జిల్లా గుంతకల్లు తిలక్ నగర్‌కు చెందిన ఇస్మాయల్ ప్రస్తుతం కర్నూలు శివారులోని గీతాముఖర్జీ నగర్‌లో నివాసముంటూ కూలీ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఇతనికి ఇద్దరు కొడుకులు, కూతురు సంతానం. శుక్రవారం రాత్రి లోకాయుక్త కార్యాలయం వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాదు నుంచి బెంగళూరు వైపు వెళ్లే గుర్తు తెలియని కారు ఢీకొంది. తలకు, కాళ్లకు బలమైన గాయాలై అపస్మారక స్థితిలో పడివుండగా స్థానికులు 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్యాజువాలిటీ వార్డులో డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీ కేంద్రానికి తరలించారు. భార్య షెహనాజ్ బేగం ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న వెంకట సుబ్బారెడ్డి

నంద్యాల(అర్బన్): రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని పెద్దకొట్టాల గ్రామ సమీపంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే ఎస్ఐ కుమారి తెలిపిన వివరాలు.. బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామానికి చెందిన కోటా ఆది వెంకటసుబ్బారెడ్డి(46) రైలు పట్టాలపై కూర్చొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య మల్లేశ్వరి, ఇరువురు కుమారులు ఉన్న వెంకటసుబ్బారెడ్డికి అప్పులు అధికం కావడంతో తీర్చే మార్గం కానరాక ఆత్మహత్యకు పాల్పడినట్లు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో వేళాంగిణి మాత దర్శన యాత్ర

నంద్యాల(వ్యవసాయం): తమిళనాడు రాష్ట్రంలోని వేళాంగణి మాత దర్శన యాత్రను నంద్యాల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ గంగాధర్ రావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జూలై 11న మధ్యాహ్నం 2 గంటలకు నంద్యాల బస్ స్టేషన్ నుంచి బయలుదేరి 12వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు వేళాంగిణికి చేరుతుందన్నారు. అక్కడి నుంచి 13న మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి 14న మధ్యాహ్నం 12 గంటలకు నంద్యాలకు చేరుకుంటున్నట్లు తెలిపారు. యాత్రలో శ్రీపురం గోల్డెన్ టెంపుల్, నాగూరులో దర్గా, నాగపట్నంలో ప్రసిద్ధి కాంచిన చర్చి, వేళాంగిణి మాత ఆలయ దర్శనం ఉంటుందన్నారు. సూపర్ లగ్జరీ స్పెషల్ బస్సు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని, రానుపోను చార్జీ రిజర్వేషన్‌తో కలిపి రూ.2,800 ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆహార పదార్థాల్లో నాణ్యత పాటించాలి

నంద్యాల(న్యూటౌన్): ఆహార పదార్థాల తయారీలో నాణ్యత పాటించాలని ఫుడ్‌సేఫ్టీ అధికారి వెంకటరాముడు హోటళ్లు, డాబాలు, రెస్టారెంట్లు, బజ్జీల బండ్ల నిర్వాహకులకు సూచించారు. శనివారం ఆయన మాట్లాడుతూ కాచిన నూనెను మరలా కాయడం, కాలం చెల్లి న ఆహార పదార్థాలు వాడటం వంటి 8 కేసులకు సంబంధించి రూ.1.80 లక్షల అపరాధ రుసుం విధించినట్లు తెలిపారు. హోటల్, డాబాలలో కలర్స్, టేస్టింగ్ సాల్ట్ వాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విషజ్వరంతో విద్యార్థిని మృతి


ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన విద్యార్థిని తులసీ

పగిడ్యాల: విషజ్వరంతో ఓ విద్యార్థిని మృతిచెందింది. లక్ష్మాపురం గ్రామం బుడుగ జంగాల కాలనీకి చెందిన అంజనమ్మ కూతురు తులసీ(10) స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. వారం క్రితం జ్వరం రావడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం విషజ్వరంగా నిర్ధారించి వైద్యం ప్రారంభించారు. కాగా కోలుకోలేక శనివారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

దర్శనం దందా!

- దర్శనం పేరుతో భక్తులకు గాలం
- అడ్డదారుల్లో జేబులు నింపుకుంటున్న దళారులు
- ఆలస్యంగా మేలుకున్న శ్రీ మఠం అధికారులు

అమాయక భక్తులు దొరికితే చాలు.. ఇక్కడి దళారులకు పండగే. అడ్డదారుల్లో దర్శనాలు చేయించి అందినకాడికి దోచుకోవడం వీరికి అలవాటే. ఏకంగా శ్రీ మఠం అధికారుల అండదండలతోనే ఈ వ్యవహారం నడుస్తుండటం ఆశ్చర్యకరం. ఇంతటి అపచారం రాఘవేంద్రుని సన్నిధిలో కొంతకాలంగా జరుగుతుండటం మహా అపచారం. – మంత్రాలయం

మంత్రాలయం ఆధ్యాత్మిక క్షేత్రం ఎంతో పేరెన్నిక గన్నది. ఇక్కడ కొలువుదీరిన శ్రీరాఘవేంద్ర స్వామి, గ్రామ దేవత మంచాలమ్మలను దర్శించుకునేందుకు ఏపీ, తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, కేరళ ప్రాంతాలతో పాటు దేశం నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. దీనినే ఆసరాగా చేసుకున్న కొంత మంది దళారులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. క్షేత్రస్థాయి ఉద్యోగుల్లో కొంత మంది ప్రైవేటు వసతి గృహాలను లీజుకు నడుపుతున్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో గదులు కేటాయించే సమయంలో గదుల అద్దెతో పాటు దర్శన సౌకర్యం, పరిమళ ప్రసాదం ప్యాకేజీగా మాట్లాడుకుంటున్నారు. సాధారణ రోజుల కంటే బుధ, గురు, శని, ఆది వారాల్లో లక్షకు పైగా భక్తులు మంత్రాలయం దర్శన నిమిత్తం వస్తుంటారు. తమ వసతి గృహాల్లో బస చేసిన వారు శ్రీ మఠం చేరుకోగానే 6, 7 గేటు నెంబర్ల వద్దకు వెళ్లి మన వారే అంటే చాలు క్షణాల్లో దర్శనం అయిపోతుంది. సాధారణ భక్తులకు మాత్రం గంటల కొద్ది సమయం పడుతుంది. అంతేగాకుండా ఇక్కడ లభించే పరిమళ ప్రసాదం తరహాలోనే కొంత మంది వ్యాపారులు కొన్ని రకాల మిఠాయిలను తయారు చేసి ప్రసాదం పేరుతో విక్రయాలు జరుపుతున్నారు. ఈ తంతు ఇటీవల కాలంలో శ్రీ మఠం విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయటపడింది.


శ్రీ రాఘవేంద్రస్వామి మఠం


మీడియాతో మాట్లాడుతున్న ఎస్.కె.శ్రీనివాసరావు

ఆలస్యంగా స్పందించిన అధికారులు

శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో స్వామి వారి దర్శన దందా బాగోతంపై శ్రీ మఠం అధికారులు ఆలస్యంగా మేల్కొన్నారు. మేనేజర్ ఎస్.కె.శ్రీనివాసరావు, శ్రీపతి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తుల సౌకర్యం కోసం ప్రత్యేక క్యూలైన్‌లో ఏర్పాటు చేశామని, ఎవ్వరూ కూడా డబ్బు కట్టి మోసపోవద్దని మైకుల ద్వా రా సూచనలు చేయించినట్లు తెలిపారు. ఎవరైనా డబ్బు వసూలు చేసినట్లెతై తమ దృష్టికి తీసుకు వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పరిమళ ప్రసాదం తరహాలోనే ప్రసాద విక్రయాలు జరుగుతున్నాయని తమ దృష్టికి రాగానే విజిలెన్స్ విభాగం వారు తనిఖీలు చేపట్టి నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. ఇక మీదట ఎవరైనా నకిలీ పరిమళ ప్రసాదం విక్రయిస్తే షాపు లీజు రద్దు చేయడమే కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

839 మంది మహిళా పోలీసులకు స్థానచలనం

- ఆప్షన్లు కంప్యూటర్ తెరపై చూపి కోరుకున్న చోటుకు నియామకం


బదిలీల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు: ఉమ్మడి కర్నూలు జిల్లాలో 839 మంది గ్రామ/వార్డు సచివాలయ మహిళా పోలీసులకు స్థానచలనం కలిగింది. ర్యాంకింగ్ ఆధారంగా మహిళా పోలీసులను బదిలీ చేశారు. కౌన్సిలింగ్ నిర్వహించారు. కర్నూలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం సచివాలయ మహిళా పోలీసులకు బదిలీల ప్రక్రియ నిర్వహించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ దగ్గరుండి పర్యవేక్షించారు. మొత్తం 839 మంది కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ రాత్రి పొద్దుపోయే వరకు సాగింది. ర్యాంకింగ్ ఆధారంగా ఖాళీ ఉన్న సచివాలయాల ఆప్షన్లను కంప్యూటర్ తెరపై చూపి కోరుకున్న స్థానానికి బదిలీ చేశారు. దృష్టి లోపం, అంధత్వం ఉన్నవారికి (విజువల్ ఛాలెంజ్), మేధో వైకల్యం (మెంటల్లీ డిసేబుల్డ్), ట్రైబ్స్ దివ్యాంగులు, మెడికల్, స్పౌజ్, జనరల్ కేటగిరీల కింద ఉన్నవారిని వరుస క్రమంలో వ్యాస్ ఆడిటోరియంలోకి పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. కంప్యూటర్ తెరపై ప్రదర్శించిన ఆప్షన్లకు అనుగుణంగా కోరుకున్న స్థానానికి నియమించారు. బదిలీల ప్రక్రియ పూర్తయినప్పటికీ జులై 1న పింఛన్ల పంపిణీ ఉన్నందున ఎక్కడివారు అక్కడే ఉండాలని పోలీసు అధికారులు తెలిపారు. పింఛన్ల పంపిణీ పూర్తయ్యేవరకు అక్కడే కొనసాగి కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం బదిలీ ప్రొసీడింగ్స్ విడుదల చేస్తామన్నారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, మహిళా పీఎస్ డీఎస్పీ శ్రీనివాసాచారి, పోలీస్ వెల్ఫేర్ డాక్టర్ స్రవంతి, సీఐలు తేజమూర్తి, ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

'కౌన్సెలింగ్' పాట్లు!

ఆదోనికి చెందిన లక్ష్మీదేవి మహిళా పోలీస్‌గా పనిచేస్తోంది. ఆరు నెలలుగా మెటర్నిటీ లీవ్‌లో ఉంది. మూడు రోజుల కిందట శిశువుకు జన్మనిచ్చింది. అయితే ఇదే సమయంలో శనివారం సచివాలయ ఉద్యోగుల బదిలీలు నిర్వహిస్తుండటంతో ఏకంగా తన చంటిబిడ్డను తీసుకుని జిల్లా పోలీసు కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు హాజరైంది. అలాగే మరికొంత మంది కడుపుతో ఉన్న ఉద్యోగినులు, ఇంకొందరు చంటిబిడ్డలతో వచ్చి అక్కడే ఊయలలు కట్టిన దృశ్యాలు కౌన్సెలింగ్ కేంద్రం వద్ద చర్చనీయాంశమయ్యాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ సాఫీగా సాగింది. అయితే ప్రస్తుతం ఈ ప్రక్రియ ప్రహసనంగా మారడంతో ఉద్యోగులకు అవస్థలు తప్పడం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు




కౌన్సెలింగ్ కేంద్రం ఆవరణలో చంటి పిల్లల అవస్థలు


చంటిబిడ్డతో లక్ష్మీదేవి

